బిల్లేరులో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

- జ్వరపీడితులను పరామర్శించిన డీఅండ్ఎంహెచ్ఓ ప్రభావతి
- రక్త నమూనాల సేకరణ
- వైద్య సిబ్బంది తీరుపై ఆగ్రహం
- ఐదు రోజుల పాటు శిబిరంలో వైద్యసేవలు


బిల్లేరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో డీఅండ్ఎంహెచ్ఓ ప్రభావతి, వైద్యులు


ఇళ్లకు వెళ్లి జ్వరాలపై ఆరా తీస్తున్న వైద్య బృందం

చౌడేపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లె పంచాయతీ బిల్లేరుకు గ్రామానికి వైద్య సిబ్బంది పరుగులు తీశారు. డీఎంఅండ్హెచ్ఓ ప్రభావతి ఎంపీపీ రామమూర్తితో కలిసి గ్రామంలో పర్యటించారు. జ్వరపీడితులను పరామర్శించారు. ‘బిల్లేరులో విషజ్వరాల విజృంభణ’ శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై డీఎంఅండ్హెచ్ఓ స్పందించారు. బుధవారం బిల్లేరులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలతో మంచం పట్టిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఐదు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. ఇక, జ్వరాలు ప్రబలడానికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామంలో పారిశుధ్యం సమస్య, దోమల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు అధికారులకు నివేదించారు. గ్రామం నడి బొడ్డున నీటి నిల్వతో నిండిన బావి దుర్వాసన చిమ్ముతోందని, ఇది దోమలకు ఆవాసంగా మారిందని చెప్పారు. దీంతో అధికారులు దోమల లార్వాల నివారణకు అబైట్ ద్రావణం పిచికారీ చేయించారు. అలాగే తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. జ్వరాలతో బాధపడుతున్నట్టు చెప్పినా ఏఎన్ఎం, ఆశా కార్యకర్త సకాలంలో స్పందించలేదని అధికారులకు ఫిర్యాదు చేయడంతో వైద్య సిబ్బందిపై డీఅండ్ఎంహెచ్ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రజలకు దోమల నిర్మూలనపై అవగాహన కల్పించారు. దోమ తెరలను వాడాలన్నారు. శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లొద్దు

ప్రజలు జ్వరాలతో పాటు అనారోగ్యానికి గురైతే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లనవసరం లేదని, ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రభావతి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్సీలో వైద్యులు సక్రమంగా ఉండడం లేదని, ఆస్పత్రి సిబ్బంది రోగులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ప్రజలు ఆమె దృష్టికి తెచ్చారు. ఇవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. జ్వరాలను అవకాశంగా తీసుకుని ప్రైవేట్, ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఇంజెక్షన్లు వేస్తూ, సెలైన్లు పెడుతూ రోగులను అందిన కాడికి దోచేస్తున్నారని, ఆకస్మిక తనిఖీలు చేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, డాక్టర్లు పవన్కుమార్, ప్రవీణ్, నవీన్తేజ్ రాయల్, ఎంపీటీసీ శ్రీరాములు, ఉపసర్పంచ్ నారాయణ,నేతలు రెడ్డెప్పరెడ్డి, అమరనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో న్యాయవిజ్ఞాన సదస్సు

పుంగనూరు: మున్సిపాలిటీలో బుధవారం సాయంత్రం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్జడ్జి వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే బాల కార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరీ నిర్మూలనకు తమవంతు కృషి చేయాలన్నారు. ప్రమాదాలలో మరణించినా, అంగవైకల్యం పొందినా వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని, దీనికి సంబంధించిన ప్రభుత్వ పథకాలు, స్కీముల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రసూల్ఖాన్, శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, ఆర్ఓ కమలాకర్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


కల్లూరు హైస్కూల్లో బాలికలకు చేస్తున్న రక్త పరీక్షల కార్యక్రమంలో డాక్టర్ జానకీరావు

బాలికలకు రక్త పరీక్షలు

పులిచెర్ల(కల్లూరు): 10–19 ఏళ్ల విద్యార్థినులు రక్తహీనత సమస్యలను అధిగమించడానికి సరైన పౌష్టికాహారం తీసుకోవాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు అన్నారు. బుధవారం కల్లూరు హైస్కూల్లో బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న బాలికలను గుర్తించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్వైజర్ శారద, హెచ్ఎం శ్రీవాణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామోపాధ్యాయులతో ఎంఈఓ లీలారాణి

పలమనేరు: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వ్యాయామోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లకు బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం స్థానిక ఉర్దూ పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు వ్యాయామ విద్య–దాని ప్రాముఖ్యత, పీఈటీలు, పీడీల బాధ్యతలు, జాబ్చార్ట్, కొత్తగా వచ్చిన యాప్లు, యోగాసనాలు, ఆటలలోని నూతన నియమ నిబంధనల గురించి చర్చించారు. పలు విషయాలపై ఎంఈఓ లీలారాణి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీల అసోసియేషన్ కార్యదర్శి నూరుద్దీన్, కన్వీనర్ శివప్రకాష్, పలువురు పీడీలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన


పుంగనూరులో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

పుంగనూరు/పలమనేరు: పుంగనూరు, పలమనేరు పట్టణాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద బుధవారం డాక్యుమెంట్ రైటర్లు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన రిజిస్ట్రేషన్ విధానం, కొత్తగా రూపొందించిన సాఫ్ట్వేర్ కారణంగా తమకు పని లేకుండా పోతోందని, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పూలత్యాగరాజు, రామమూర్తి, రెడ్డిపల్లి రవీంద్ర, పవన్కుమార్, సోమలబాబు, జగదీష్, మునిరాజ, హరినాథ్బాబు, సాదిక్, మస్తాన్, ఖలీల్, పాతూరు సామి తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులకు రూ.10 లక్షల బీమా


సమావేశంలో మాట్లాడుతున్న జింకా వెంకటాచలపతి, చిత్రంలో అలీమ్బాషా, భాస్కర్రెడ్డి

పుంగనూరు: పార్టీ కార్యక్రమాలు నిర్వహించేందుకు నియమించిన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లకు ఒకొక్కరికి రూ.10లక్షల బీమా సౌకర్యం పార్టీ పరంగా ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ, మండల కన్వీనర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా ఎవరూ చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో జీవితబీమా కార్యక్రమాన్ని పటిష్టంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్బాషా తదితరులు మాట్లాడారు. పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, సచివాలయ మండల కన్వీనర్లు కొత్తపల్లె చెంగారెడ్డి, వరదారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, వైఎస్సార్సీపీ నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, ఆవుల అమరేంద్ర పాల్గొన్నారు.

కల్లూరు పంచాయతీలో నగదు రహిత సేవలు


కల్లూరు పంచాయతీలో నగదు రహిత సేవలు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం నుంచి నగదు రహిత సేవలను ప్రారంభించారు. ఇంటిపన్ను, నీటిపన్ను, లైసెన్స్ ఫీజులు, భవన నిర్మాణా రుసుము మొదలైనవి చెల్లించడానికి నగదు రహిత లావాదేవీలను ఉపయోగించుకోవచ్చని సర్పంచ్ షుకూర్ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, ఈఓ యుగంధర్, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.98లక్షలు

గంగవరం: మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం మూడు హుండీల ఆదాయం లెక్కించారు. టీటీడీ విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మొత్తంగా రూ.1.98 లక్షల ఆదాయం సమకూరిందని, ప్రతి నెలా దాదాపు ఇదే మొత్తంలో ఆదాయం వస్తోందని టెంపుల్ ఇన్స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఆలయ ఏఈఓ గోపీనాథ్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్సీలకు శిక్షణ

పలమనేరు: మండలంలోని సీఆర్సీ(క్లస్టర్ రిసోర్స్ సెంటర్) పరిధిలోని హెచ్ఎం, జాయింట్ సెక్రటరీలకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమం స్థానిక ఎమ్మార్సీలో బుధవారం మొదలైంది. ఆయా సబ్జెక్టుల్లోని కీలక విషయాలను సంబంధిత ఆర్పీలు వివరించారు. పాఠ్యాంశ బోధనలో ఉపయుక్తంగా ఉండేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్టు ఎంఈఓలు బాలసుందరం, లీలారాణి తెలిపారు. మండలంలోని ఎంపీకోటూర్, దొడ్డిపల్లె, పెంగరగుంట, కొలమాసనపల్లె, స్థానిక హైస్కూల్ క్లస్టర్ల టీచర్లు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

పుంగనూరు: నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను నియంత్రించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు విమర్శించారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో సమరభేరి కార్యక్రమం పేరిట ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.1200లకు పెరిగిందని విమర్శించారు. ఇప్పుడు రాబోవు లోక్సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ గ్యాస్ ధరలను తగ్గించి, ఓట్ల కోసం జిమ్మిక్కులు చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారుల కొమ్ముకాస్తోందని, దేశ ప్రయోజనాలను పట్టించుకోలేదని ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మురళి, రమణ, కృష్ణ, నరేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించండి


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డీఆర్ఓ

చిత్తూరు కలెక్టరేట్: బీఎల్ఓలు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఆర్ఓ రాజశేఖర్ అన్నారు. ఆయన బుధవారం నగరంలోని ప్రశాంత్ నగర్లో ఓటర్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాను పరిశీలించినట్లు చెప్పారు. బీఎల్ఓలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈఆర్ఓలు, స్పెషల్ ఆఫీసర్స్, ఏఈఆర్ఓలు కసరత్తును పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరబాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నట్లు డీఆర్ఓ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, పలువురు బీఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో మేలు


రైతులకు ఉలవ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, నాయకులు

- ఉలవ విత్తనాల పంపిణీలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వర్షాభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం మేలని, ఈ దిశగా వ్యవసాయశాఖ సబ్సిడీపై ఇస్తున్న ఉలవ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద మండలంలోని రైతులకు ఆయన ఉలవ విత్తనాల పంపిణీ చేసి మాట్లాడారు. 80శాతం సబ్సిడీతో ఇస్తున్న ఉలవలను రైతులు సాగుకు వినియోగించకుండా ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఖరీఫ్ సీజన్లో విత్తనాలేసే సమయంలో వర్షం రాక బీడుగా ఉన్న పొలాల్లో ఇప్పుడు ఉలవలను చల్లితే రైతులు కొంతైనా మేలు కలుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని ఇస్తోందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణదేవి మాట్లాడుతూ, ఉలవలు కిలో ధర రూ.108గా ఉండగా ప్రభుత్వ రాయితీ రూ.86.40 పైసలు పోను రైతులకు రాయితీపై రూ.21.60 పైసలను మాత్రమే ఇస్తోందన్నారు. మండలానికి సంబంధించి 130 క్వింటాళ్లను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ–క్రాప్ నమోదు మేరకు వేరుశనగ వేయకుండా భూములు బీడుగా వదిలిన రైతులు ఉలవలు సాగు చేయాలని కోరారు. విత్తనాలను బయోమెట్రిక్ ఆధారంగా ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి సంధ్య, నాయకులు రంగన్న, చెంగారెడ్డి, గోవిందస్వామి, గోవిందురెడ్డి, విజయ్, బాలాజీనాయుడు, రమేష్బాబు, రఫీ, తిరుమలేష్, ఈశ్వర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ చివరి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

పలమనేరు: పాలిటెక్నిక్ కళాశాలల్లో చివరి విడత ప్రవేశాలకు ప్రకటన వెలువడిందని పలమనేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ తెలిపారు. పాలిసెట్ ద్వారా ఇప్పటికే ప్రవేశాలు పొందిన విద్యార్థులు, ఇంకనూ ప్రవేశాలు పొందని వారు ఈ కౌన్సెలింగ్లో సీట్లను పొందే అవకాశం ఉంటుందని, ఇప్పటివరకూ సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోని వారు సైతం నిర్ణీత ఫీజు చెల్లించి సెప్టెంబర్ 1 వరకూ చేసుకోవచ్చని చెప్పారు. వెబ్ ఆప్షన్లను వచ్చే నెల 2వ తేదీ వరకు, ఆ తర్వాత 4న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. చివరి కౌన్సెలింగ్లో సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ లోపు కళాశాలలో చేరాల్సి ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన తిరుపతిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తారని, పలమనేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోని అన్ని విభాగాల్లోనూ సీట్లు మిగిలి ఉన్న నేపథ్యంలో దీనిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకృష్ణాష్టమి పోస్టర్ల ఆవిష్కరణ


శ్రీ కృష్ణాష్టమి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: కుప్పం రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహించనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా ప్రబోధానంద సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. సెప్టెంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహిస్తామని, వీటికి హాజరు కావాలని ఎమ్మెల్సీని సమితి సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, ప్రకాశ్, నాగరాజు, శివకృష్ణ, మంజునాథ్, శరవణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత


డీసీసీ బ్యాంకు నిర్వహిస్తున్న కళాజాత

పుంగనూరు: ఆర్థిక అక్షరాస్యతపై పట్టణంలోని ఇందిరా సర్కిల్లో డీసీసీ బ్యాంకు బుధవారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించింది. బ్యాంకు మేనేజర్ రాధారాణి, అసిస్టెంట్ మేనేజర్ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రైతులకు పంట రుణాలు, బంగారు రుణాలు, మహిళా సంఘాలకు పొదుపు రుణాలు, ప్రధానమంత్రి సురక్ష, అటల్ పెన్షన్ యోజనతో పాటు సైబర్ నేరాలు తదితర విషయాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు తాము కళాజాత నిర్వహించామన్నారు. ప్రజలు వీటిపై అవగాహన పెంచుకుని ఆర్థికాభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ఆర్థిక నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటరాముడు, కర్నూలుకు చెందిన ఎంవీరూరల్ ఫోక్ ప్రతినిధులు విజయానంద్, రాఘవేంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష



మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోలర్ అధికారి ఆనందరెడ్డి

చౌడేపల్లె: ఉపాధి హామీ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయాలని సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ అధికారి ఆనంద్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ, ఎన్ఐసీ విధి విధానాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అంచనాలో పొందుపరచిన మేరకు పనులు చేయాలని, పనుల సమయంలో తీసిన మట్టిని బర్మ్ వదిలి కట్టగా వేయాలన్నారు. కట్టపై వేసిన మట్టిని సెక్షన్ చేయాలన్నారు. కూలీలు చేసిన పనికి మాత్రమే టాస్క్ వారీగా గుర్తించి చెల్లింపులు చేయాలన్నారు. కొలతల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సాంకేతిక సిబ్బందికి అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్, జేఈ ధనుంజయుడు, టీఏలు అమరనాథ్, సయ్యద్బాషా తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ నిర్మాణాలు వేగవంతం చేయాలి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ సుధీర్

కుప్పం రూరల్: మున్సిపాలిటీ నూతన కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చైర్మన్ డాక్టర్ సుధీర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కుప్పం ప్రజలపై అభిమానంతో మున్సిపాలిటీకి 66 కోట్ల రూపాయలు కేటాయించారని, నాణ్యతాప్రమాణాలతో పనులు చేయాలని, నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కరెంటు షాక్తో ఆవులు మృతి


మరణించిన ఆవుల్లో ఒక ఆవు

కుప్పం రూరల్: కరెంటు షాక్కు గురై రెండు ఆవులు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కుప్పం మండలం పెద్దబంగారునత్తంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం..గ్రామానికి చెందిన శశికుమార్కు రెండు పాడి ఆవులున్నాయి. మంగళవారం రాత్రి ఆరుబయటే వాటి కట్టి ఉంచాడు. రాత్రి గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ తీగలు తెగి ఆవులపై పడ్డాయి. దీంతో కరెంటు షాక్కు గురై రెండు ఆవులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. పాడి ఆవుల మృతితో జీవనాధారం కోల్పోయానని, ఇక కుటుంబాన్ని ఎలా పోషించాలని శశికుమార్ భోరున విలపించాడు. ఆవుల విలువ రెండు లక్షల రూపాయలని స్థానికులు చెప్పారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

సదుం: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప సూచించారు. అమ్మగారిపల్లె, తిమ్మానాయనపల్లె సచివాలయాల పరిధిలోని వారికి నిర్వహించిన జీవిత బీమా నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు వరలక్ష్మి, మురళీరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సింగిల్విండో వైస్ చైర్మన్ రమేష్రెడ్డి, వాసు, సాకేత్రెడ్డి పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నేతలు

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లెలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 67 మందికి కళ్లద్దాలను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప బుధవారం పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తున్నట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీరెడ్డి, సీహెచ్ఓ హరిప్రియ, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్రెడ్డి, విమల పాల్గొన్నారు.

ఉచిత బియ్యం తీసుకోకపోతే రేషన్ కార్డు రద్దు

రొంపిచెర్ల: ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అమరనాథ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ బియ్యం లబ్ధిదారులు సక్రమంగా తీసుకోవడం లేదని, దీని వలన ప్రభుత్వ ఆశయం దెబ్బ తింటుందన్నారు. లబ్ధిదారులు మూడు నెలలు బియ్యం తీసుకోకపోతే బియ్యం కార్డును రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్డు రద్దయితే ప్రభుత్వ పథకాల ఫలాలు కూడా పొందలేరని స్పష్టం చేశారు. మండలంలో ఎక్కడైనా ఉచిత బియ్యం బ్లాక్ మార్కెట్కు తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎంపీడీఓగా తాజ్ మస్రూర్



గుడుపల్లె: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.తాజ్ మస్రూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్ అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలోకి గంగవరం మండలం నుంచి బదిలీపై తాజ్ మస్రూర్ వచ్చారు. అర్హులందరికీ పథకాలు అందేలా పనిచేస్తామని ఆయన చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయాలలోని డిజిటల్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమావేశమయ్యారు.

భక్తిప్రపత్తులతో పున్నమి పూజలు


ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

పుంగనూరు: మండలంలో ఏడూగు గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం పున్నమి పూజలు భక్తిప్రపత్తులతో చేశారు. వేకువజామునే ఆలయంలో హోమాలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజార్చనలు చేశారు. అలాగే పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

ఐరాల: మామిడి రైతులకు వైఎస్ గేటు సమీపంలోని కలెక్షన్ సెంటర్లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్రెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ సీనియర్ శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు.

ఈరోజు

మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్బాషా తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: పుంగనూరు ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సీతారామన్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలపై చర్చిస్తామని, ప్రజాప్రతినిధులు, అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.